హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.126	183	208
సూర్యాపేట	రూ.120	180	210
నల్లగొండ	రూ.126	184	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 35.5 , కనిష్ఠం 23.0




అభ్యర్థుల ఎంపిక తుది దశకు

- బీఆర్ఎస్ అభ్యర్థులపైనే అందరి ఆసక్తి
- కాంగ్రెస్‌లో భువనగిరి సీటుపై పోటాపోటీ
- ఇద్దరు అభ్యర్థుల్ని ప్రకటించి ముందంజలో ఉన్న బీజేపీ

నల్లగొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల సమరం మొదలవడంతో ఉమ్మడి జిల్లాలో ఎంపీ అభ్యర్థుల ఎంపిక కోసం పార్టీల కసరత్తు చివరి దశకు చేరింది. బీజేపీ ఇప్పటికే భువనగిరి లోక్‌సభ స్థానానికి మాజీ ఎంపీ డాక్టర్ బూరనర్సయ్యగౌడ్, నల్లగొండ స్థానానికి మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డికి టికెట్ కేటాయించడంతో వారు ప్రచారం కూడా ప్రారంభించారు. కాంగ్రెస్ తొలిజాబితాలో నల్లగొండ స్థానం టికెట్‌ను మాజీమంత్రి జానారెడ్డి తనయుడు కుందూరు రఘువీర్‌రెడ్డికి కేటాయించగా, ఆయన కూడా మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలను కలుస్తూ ఆశీస్సులు కోరుతున్నారు. బీఆర్ఎస్ మాత్రం ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలోని రెండు సీట్లకు అభ్యర్థులను ఎంపికచేయకపోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది.

బీఆర్ఎస్ ఇప్పటికీ అభ్యర్థులను ప్రకటించకపోవడం, రెండింటిలో ఒకటి బీసీలకు, మరోటి జనరల్ అభ్యర్థులకు కేటాయిస్తారనే చర్చ నేపథ్యంలో ఎక్కడ ఎవరికి అవకాశం దక్కుతుందనే అంశం ఆసక్తికరంగా మారింది. భువనగిరి నుంచి కంచర్ల కృష్ణారెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్ అభ్యర్థిత్వాలపై పార్టీ ఉన్నతస్థాయిలో పరిశీలిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్‌లోనూ భువనగిరి స్థానంపై పోటాపోటీ నెలకొంది. కోమటిరెడ్డి కుటుంబీకులతో పాటు, బీసీ నేతలు, వలస నేతలు ఈ టికెట్ కోసం అధిష్ఠానం వద్ద ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధాన పార్టీల్లో మిగిలిన అభ్యర్థులు తేలితే ప్రచారం జోరందుకుంటుందని, నేడో, రేపో ఉత్కంఠకు తెరపడుతుందని ఆయా పార్టీల సీనియర్ నేతలు చెబుతున్నారు.

బీఆర్ఎస్ టికెట్ ఎవరికో?



ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లకు బీఆర్ఎస్ ఇంకా అభ్యర్థులను ఎంపిక చేయకపోవడంపై ఉత్కంఠ నెలకొంది. రెండింటిలో భువనగిరి స్థానానికి బీసీలకు కేటాయిస్తారనే చర్చ జోరందుకోవడంతో నల్లగొండ టికెట్ ఎవరికి దక్కుతుందనేది ఆసక్తికరంగా మారింది. కొన్నాళ్ల క్రితం వరకు జిల్లాలో ఎక్కడ అవకాశం కల్పించినా పోటీ చేస్తానని ప్రకటించిన శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి చివరికి పోటీ నుంచి తప్పుకున్నారు. మరో కీలకనేత తేరా చిన్నపరెడ్డి సైతం పోటీకి అంతగా ఆసక్తిగా లేరనే సమాచారంతో అధిష్ఠానం బలమైన అభ్యర్థుల కోసం అన్వేషిస్తోంది. భువనగిరి స్థానాన్ని బీసీలకు కేటాయించాలని దాదాపు నిర్ణయించగా, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌కు టికెట్ దక్కవచ్చని భావిస్తున్నారు. మరో కీలకనేత క్యామ మల్లేశ్‌యాదవ్ కూడా ఈ టికెట్‌పై ఆశలు పెట్టుకున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. బీసీలకు మాత్రమే టికెట్ కేటాయించాలని పార్టీ భావిస్తే ఈ ఇద్దరునేతల్లో ఒకరికి ఛాన్స్ దక్కే అవకాశం ఉంది. నల్లగొండ లోక్‌సభ స్థానానికి అభ్యర్థి ఎంపికలో అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తోంది. ఎంపీ టికెట్ బరి నుంచి పోటీ నుంచి విరమించుకున్నానని అమిత్ ప్రకటన చేశాక, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డిలో ఒకరిని పోటీ చేయిస్తారని చర్చ సాగింది. అయితే చిన్నపరెడ్డి సైతం బీజేపీ వైపు చూస్తుండడంతో కంచర్ల కృష్ణారెడ్డి అభ్యర్థిత్వంపై పార్టీ సమాలోచనలు చేస్తున్నట్టు తెలిసింది. కృష్ణారెడ్డిని బరిలో దింపుతారా? లేక వేరే సమీకరణాన్ని తెరమీదకు తెస్తారా? అనే అంశం తేలాల్సి ఉంది. అభ్యర్థుల ఎంపిక కొలిక్కివచ్చినట్లేనని, బలమైన అభ్యర్థులతో పోటీలో దిగుతామని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

రంగంలోకి సీపీఎం

లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి పోటీలో ఉంటామని సీపీఎం ఇప్పటికే ప్రకటించింది. ఈ మేరకు పార్టీ కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి భువనగిరి పార్లమెంట్ నుంచి పోటీలో ఉంటారని పార్టీ ప్రకటించింది. వామపక్ష పార్టీల నుంచి సీపీఎం రంగంలో ఉండగా, సీపీఐ సైతం రాష్ట్రంలో ఒక ఎంపీ స్థానాన్ని కేటాయించాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరింది. ఈ నేపథ్యం లో కాంగ్రెస్ పార్టీ తీసుకునే నిర్ణయంపై సీపీఐ పోటీచేసే స్థానాలు ఆధారపడి ఉన్నాయి. సీపీఎం ఒంటరిగానే పోటీకి సిద్ధమైంది.



కాంగ్రెస్‌లో భువనగిరి సీటుపై తర్జనభర్జన

నల్లగొండ లోక్‌సభ అభ్యర్థిగా పీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డిని ప్రకటించిన కాంగ్రెస్ భువనగిరి అభ్యర్థి ఎంపిక విషయంలో తర్జనభర్జన పడుతోంది. కోమటిరెడ్డి బ్రదర్స్ రెండు పర్యాయాలు ప్రాతినిత్యం వహించిన ఈ నియోజకవర్గంలో ఇప్పటికే బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ డాక్టర్ బూరనర్సయ్యగౌడ్ ప్రచారం చేసుకుపోతుంటే, బీఆర్ఎస్ సైతం బీసీ అభ్యర్థినే బరిలో నిలిపే సంకేతాలు ఇస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ దీటైన అభ్యర్థిని బరిలో దింపాలని కాంగ్రెస్ అధిష్ఠానం యోచిస్తోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మికి టికెట్ కోసం బలంగా పట్టుబడుతుంటే, పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఈసారి తనకు పోటీఛాన్స్ వస్తుందనే విశ్వాసంతో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సీటును గుత్తా అమిత్‌రెడ్డి సైతం ఆశిస్తుంటే, ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన సినీ నటుడు అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి సైతం ఈ సీటుని ఆశిస్తున్నట్టు తెలిసింది. మరోవైపు బీజేపీ, బీఆర్ఎస్ బీసీలను బరిలో దింపితే కాంగ్రెస్‌లోనూ బీసీనేతలకు ఇవ్వాలనే డిమాండ్ తెరమీదకు వచ్చే అవకాశం ఉంది. బీసీ కోటాలో పున్నా కైలాష్‌నేత, నేతి విద్యాసాగర్, చెనగాని దయాకర్‌గౌడ్ తదితర నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. సోమవారం జరిగిన సీఈసీలో ఈ సీటుకు అభ్యర్థి ఎవరనే అంశంపై కసరత్తు జరిగిందని, సునీల్ కనుగోలు నివేదికలు కూడా తెప్పించుకున్న అధిష్ఠానం బలమైన అభ్యర్థిని బరిలో దింపేందుకు కసరత్తు చేస్తోందని పార్టీ నేతలు చెబుతున్నారు.



గుట్టలో వైభవంగా రథోత్సవం

చూడముచ్చటగా యాదాద్రీశుడికి వెండి గరుడసేవ

యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి వార్షిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం లక్ష్మీనరసింహుల వెండి గరుడవాహన సేవ చూడముచ్చటగా కొనసాగింది. ఈ పర్వాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. •7లో..



జిల్లాలో జరిపిన అధ్యయన వివరాల ప్రతులు ఆవిష్కరిస్తున్న రుక్మిణీరావు, జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, తదితరులు

ప్రభుత్వ మద్దతుతోనే మహిళా రైతులపై హింస కనుమరుగు

వర్క్‌షాప్‌లో సామాజిక వేత్తలు, మహిళా రైతులు •7లో..

శాంతి భద్రతల పరిరక్షణకు ఫ్లాగ్ మార్చ్



నల్లగొండలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

ఏఎస్పీ రాములునాయక్

నల్లగొండ టౌన్, మార్చి 19: ప్రజల్లో ఎన్నికలపై ఆత్మవిశ్వాసం కలిగించడం, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్టు అదనపు ఎస్పీ రాములునాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జిల్లా పోలీసులు, ఐటీబీపీ (ఇండో టిబెటన్ బార్డర్ ఫోర్స్) బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ప్రారంభమైన కవాతు లైన్‌వాడి, ఓల్డ్ సిటీ, చౌరస్తా, పీవీఎన్ టాకీస్, అక్కచెల్మ, ఫూల్ సెంటర్, యాదవ సంఘం, క్లాక్ టవర్, ప్రకాశంబజార్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలోని అన్ని మండలాల్లో కవాతు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల్లో ఎక్కడా అవాంఛనీయ ఘటన జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా పోలీసులు, కేంద్ర బలగాలు విధులు నిర్వర్తిస్తాయన్నారు. బందోబస్తు మాత్రమే గాకుండా డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువుల అక్రమ రవాణా అరికట్టేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.శివరాంరెడ్డి, ఎస్బీ డీఎస్పీ రమేష్, సీఐలు సత్యనారాయణ, డానియల్, కరుణాకర్, ఎస్ఐలు శంకర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



నల్లగొండలోని ఓ కేంద్రం వద్ద పదోతరగతి విద్యార్థులు

నల్లగొండ, మిర్యాలగూడ టౌన్, మార్చి 19: జిల్లా వ్యాప్తంగా మంగళవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. జిల్లాలో మొత్తం 109 కేంద్రాల్లో జరిగిన పరీక్షకు మొత్తం 19,249మంది విద్యార్థులకు 19,198మంది హాజరు కాగా, 51మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు. అధికారులు జిల్లాలోని 53 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మిర్యాలగూడ పట్టణంలో 12 కేంద్రాల్లో 2,626 మంది విద్యార్థులు హాజరు కాగా, 10 మంది గైర్హాజరయ్యారు. పట్టణంలోని బకాల్‌వాడీ, కృష్ణవేణి పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలను డీఈవో బొల్లారం భిక్షపతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని ఆదేశించారు.

కట్టంగూరు పీఏసీఎస్‌కు పీఐసీ!

నల్లగొండ, మార్చి 19: గత ప్రభుత్వ హయాంలో కట్టంగూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) గడువును పలుమార్లు పొడిగిస్తూ రాగా, ప్రస్తుతం ఆ గడువు సైతం తీరడంతో పీఐసీ (పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ) నియామకానికి ప్రభుత్వానికి జిల్లా సహకారశాఖ అధికారి ఆర్.కిరణ్‌కుమార్ నివేదించారు. కట్టంగూరు పీఏసీఎస్ పాలవర్గం 2016, డిసెంబరు 8న ఎన్నిక కాగా, మొత్తం 14మంది డైరెక్టర్లు ఉన్నారు. ఈ పాలకవర్గం గడువు 2021, డిసెంబరు 7వ తేదీతో ముగిసింది. అయితే గత ప్రభుత్వ హయాంలో అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పాలకవర్గ గడువును ప్రతీ ఆరు నెలలకొకసారి పెంచుతూ వెళ్లారు. దీంతో పాలనలో రాజకీయ జోక్యం పెరిగి సొసైటీలో పలు అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా మండలంలోని దుగ్గినపల్లి, మల్లాపురం, కల్మెరలో ధాన్యం కొనుగోళ్లలో అవతవకలు జరిగాయని, కొందరు డైరెక్టర్లు నల్లగొండలో కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా సహకార శాఖ అధికారులు విచారణకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు పెంచిన పాలకవర్గం గడువు ముగియడంతో ఆఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ(పీఐసీ)ని నియమించాలని ప్రభుత్వానికి జిల్లా సహకారశాఖ డీసీవో ఆర్.కిరణ్‌కుమార్ నివేదిక పంపించారు. ఆమేరకు సహకార శాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వెలువడే అవకాశాలు ఉన్నాయి. ఎన్నికల కోడ్‌తో పీఐసీ నియామకానికి ఎలాంటి సంబంధం లేదని డీసీవో పేర్కొన్నారు. పీఐసీ నియామకం వరకు ప్రస్తుతం ఉన్న పాలకవర్గమే కొనసాగుతుందని డీసీవో తెలిపారు. పాలకవర్గ గడువు విషయమై పీఏసీఎస్ సీఈవో మల్లారెడ్డిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఈ విషయం తన పరిధిలోనిది కాదని తెలిపారు. అంతా ప్రభుత్వం నిర్ణయమేనని, జిల్లా సహకార అధికారులను వివరాలను అడగాలంటూ కలెక్టరేట్‌లో ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించడానికి ఆయన నిరాకరించారు.

మహిళలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ దాసరి హరిచందన

నల్లగొండ టౌన్, మార్చి 19: ప్రతీ మహిళ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. మంగళవారం ఆమె టీటీడీసీలోని జిల్లా సమాఖ్య భవనంలో మహిళా సంఘాలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. మే నెలలో దేశవ్యాప్తంగా జరగనున్న పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా, ఓటు హక్కు కలిగిన ప్రతీ మహిళ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా సరైన నాయకున్ని ఎన్నుకోవాలన్నారు. సమాజానికి ఉపయోగపడే నాయకుడిని ఎన్నుకుంటే మన భవిష్యత్తుతో పాటు, పిల్లల భవిష్యత్తు బాగుంటుందన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని, ఈ ప్రభావం ఎన్నికల్లో సైతం కనిపించాలన్నారు. అందుకు మహిళలంతా తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహిళా ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చేందుకు స్వీప్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా ఓటర్లను ప్రలోభానికి గురిచేస్తే తక్షణమే సీ-విజిల్ యాప్ లేదా 1950 హెల్ప్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమావేశంలో డీఆర్డీవో నాగిరెడ్డి, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, అదనపు డీఆర్డీవో శారద, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలి



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన ఎఫ్ఎస్‌టీ(ఫ్లయింగ్ సర్వేలైన్స్ టీం), ఎస్ఎస్‌టీ (స్టాటిక్ సర్వేలైన్స్ టీం) బృందాలు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎఫ్ఎస్‌టీ బృందాలు ఒకే చోట ఉండకుండా క్షేత్రస్థాయిలో అన్ని ప్రాంతాలు తిరుగుతూ తనిఖీలు నిర్వహించాలన్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా అనుమతులు తీసుకున్నది, లేనిది, అదే విధంగా ర్యాలీల అనుమతులు, ఇతర అనుమతులను పరిశీలించాలన్నారు. పకడ్బందీగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుందన్నారు. ఎక్కడైనా నగదు స్వాధీనం చేసుకున్నప్పుడు సంబంధిత పోలింగ్ స్టేషన్లో సీసీటీవీ కెమెరా నియంత్రణలో ఉంచాలని, విషయాన్ని తక్షణమే జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీకి తెలియజేయాలన్నారు. ఎస్పీ చందనా దీప్తి మాట్లాడుతూ, అనుమానం వచ్చినచోట ఎస్ఎస్‌టీ బృందాలు మొత్తం సంఘటనను వీడియోగ్రఫీ చేయాలన్నారు. బృందాలు నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల విధులకు నియమితులైన అన్ని బృందాలు చెక్ పోస్టుల వద్ద అందుబాటులో ఉండాలన్నారు. ఒక్కోసారి ఎఫ్ఎస్‌టీ నివేదిక ఆధారంగానే ఎఫ్ఐఆర్ బుక్ చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, టి.పూర్ణచందర్, డీఆర్వో డి.రాజ్యలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, ఏఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల వివరాలు సమర్పించాలి

జిల్లా వ్యాప్తంగా ఇంజనీరింగ్ విభాగాల కింద జరుగుతున్న పనులు, ప్రస్తుత పరిస్థితిపై పూర్తి వివరాలు సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అన్ని శాఖల ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున చేయాల్సిన పనులు, చేయకూడని పనులపై దిశా, నిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పూర్ణచందర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ అణువులో దేవుడు ఉన్నాడు



భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న చినజీయర్ స్వామి

త్రిదండి చినజీయర్ స్వామి

నల్లగొండ రూరల్, మార్చి 19: ప్రతీ అణువులో దేవుడు ఉంటాడని త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. మంగళవారం మండలంలోని రాములబండ సీతారామచంద్రస్వామి ఆయల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నూతన రథాన్ని చినజీయర్ స్వామి ప్రారంభించి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. దేవుడు మనలోని చెడు భావాలను కడిగి మంచి భావాలను పెంచుతాడన్నారు. తాను జిల్లాలోని చాలా గ్రామాలు తిరిగానని, ఎక్కడా లేనంత భక్తి భావం రాములబండ గ్రామంలో ఉందన్నారు. ఇక్కడి సీతారాముల దేవాలయం అత్యంత ప్రాచీనమైనదని, సుమారు రెండు, మూడు వందల సంవత్సరాల క్రితమే ఈ దేవాలయం నిర్మించినట్టు తెలుస్తోందన్నారు. ఇంత ప్రాచీన దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయడం తనకు ఎంతో ఆనందాన్ని కలగజేసిందన్నారు. దోమలపల్లి వంశస్థులు ఈ పురాతన దేవాలయాన్ని నిర్మించగా, ఆ వంశస్థులు నాలుగు తరాలుగా స్వామివారి సేవలో ఉన్నారన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలను దేవుడి పుట్టుక సందర్భంగా నిర్వహిస్తారని అన్నారు. మొట్ట మొదటిసారిగా బ్రహ్మోత్సవాలను పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నిర్వహించారని తెలిపారు. మనందరిలో దేవుడున్నాడని చెప్పడానికే స్వామివారిని ఊరేగిస్తామన్నారు. దేవుడు మనలోని భయాన్ని పోగొడతాడని, ఆయన ప్రసాదం మనకు మనోబలం లాంటిది అన్నారు. ప్రతీ ఒక్కరు రాముని చరిత్రను తెలుసుకోవాలని, ఆయన చరిత్రను అందరూ చదవాలన్నారు. దేవాలయ ఛైర్మన్ కెప్టెన్ దోమలపల్లి విజయ్‌కుమార్ మాట్లాడుతూ, ఈ నెల 22న రథోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. స్వామివారి కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోమలపల్లి ప్రభాకర్‌రావు, దోమలపల్లి అమరేందర్, రావుల కుటుంబ సభ్యులు, దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తదితరులు

మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో పోరాడాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, మార్చి 19: మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో యువత పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక దొడ్డి కొమురయ్య భవనంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కమ్యూనిస్టు సిద్ధాంతాలను మల్లు స్వరాజ్యం దృఢంగా నమ్మి 16 ఏళ్ల వయసులో ఉద్యమంలోకి వచ్చారన్నారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి, బానిసత్వానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో ఆమె పాల్గొన్నారన్నారు. తర్వాత కాలంలో గెరిల్లా పోరాటంలో మహిళలను చేర్చుకోవడం, వారికి శిక్షణ ఇవ్వటంలో ఆమె కీలక పాత్ర పోషించారన్నారు. రాష్ట్రంలో సారా వ్యతిరేక ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజా సమస్యలపై అసెంబ్లీలో వాణి వినిపించారన్నారు. శాసనసభలో సైతం ఆమె అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వాలు గడగడలాడేవన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రజా ఉద్యమాల నిర్వహణలో ముఖ్యంగా మహిళలకు స్వరాజ్యం జీవితం ఆదర్శనీయమన్నారు. ఆమె పోరాట స్ఫూర్తితో పాలకులు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి, నాయకులు పి.నర్సిరెడ్డి, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, మహమ్మద్ సలీం, మల్లం మహేష్, దండంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, నలుపరాజ సైదులు, ఎం.భిక్షం, మారగోని నగేశ్, కోట్ల అశోక్‌రెడ్డి, బి.పరిపూర్ణచారి, మధుసూదన్‌రెడ్డి, నర్సింహ, కందుల అశోక్, సలీవోజు సైదాచారి, పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

మునుగోడు: మతవాద రాజకీయాలతో పాటు కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మల్లు స్వరాజ్యం వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఒకే జెండా, ఒకే మతం ఉండాలన్న దురుద్దేశంతో బీజేపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చి హాట్రిక్ సాధిస్తామని కలలుకంటున్న బీజేపీని ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మునుగోడు మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న, సీపీఎం మండల కార్యదర్శి మిర్యాల భరత్‌కుమార్, వరికుప్పల ముత్యాలు, యాసరాణి శ్రీను, లింగస్వామి, యాదయ్య, సాగర్ల మల్లేష్, కొంక రాజయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

రూ.23.14లక్షల నగదు, మద్యం స్వాధీనం

ఆత్మకూరు(ఎస్)నార్కట్‌పల్లి, దామరచర్ల,కోదాడరూరల్, తిప్పర్తి, మద్దిరాల, మార్చి 19: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనుమతికి మించి తరలిస్తున్న రూ.23.14 లక్షల నగదుతో పాటు అక్రమంగా నిల్వ చేసిన రూ. 42,170 విలువైన మద్యాన్ని, రూ. 1.96 లక్షల విలువ చేసే మిక్సీలు, గ్యాస్ స్టవ్‌లు, రైస్ కుక్కర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

● నార్కట్‌పల్లి పరిధిలోని హైదరాబాద్-విజయవాడ రహదారిపై ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఎలాంటి ఆధారాలు లేకుండా ముగ్గురి వద్ద ఉన్న రూ. 3,04,500ల నగదుతో పాటు పలు గ్రామాల్లోని బెల్ట్‌షాపుల్లో నిల్వచేసిన రూ. 32,170 విలువైన మద్యంబాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

●ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు చెందిన పెనక గోపీనాథ్ తన కారులో హైదరాబాద్ నుంచి నెల్లూరుకు రూ.9.50 లక్షల నగదుతో వెళ్తున్నాడు. దామరచర్ల మండలం వాడపల్లి చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో నగదుకు సంబంధించిన ఆధారాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకుని మిర్యాలగూడ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

● ఏపీ రాష్ట్రం నుంచి హైదరాబాద్ వెళుతుండగా సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఐదు కార్లలో తనిఖీచేసి మొత్తం రూ.4,76,900 నగదును గుర్తించినట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

●నల్లగొండజిల్లా మిర్యాలగూడలోని సాగర్‌రోడ్డుపై నిర్వహించిన తనిఖీలో ఓ కంపెనీ డిటర్జెంట్ పౌడర్ సప్లయ్ డీలర్ గంగుల రాంబాబు ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.84వేల నగదును సీజ్‌చేశారు.

● సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని ఖమ్మం జిల్లా సరిహద్దు శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్టులో రూ.1.96 లక్షలు విలువ చేసే మిక్సీలు, గ్యాస్ స్టవ్‌లు, రైస్ కుక్కర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఖమ్మం నుంచి డీసీఎం వ్యాన్‌లో కోదాడకు వస్తుండగా, చెక్‌పోస్టు వద్ద వ్యాన్‌ను తనిఖీ చేయగా, ఈ వస్తువులు బయట పడ్డాయన్నారు.

● తిప్పర్తి మండలం చిన్నసూరారం గ్రామానికి చెందిన జక్కలి సతీష్ తన నివాసంలో బెల్ట్ షాపు నిర్వహిస్తుండగా ఎఫ్ఎస్‌టీ టీం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి రూ.10వేల విలువ చేసే 14 బీర్లు, 10 ఐబీ మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు.

● సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలంలో పరిమితికి మించి తీసుకెళ్తున్న రూ. 2.50లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మధునాయుడు తెలిపారు. మండలంలోని కుంటపల్లి చెక్‌పోస్టు వద్ద హన్మకొండ జిల్లా అన్నెపర్తి మండలం జైపూర్ గ్రామానికి చెందిన బొజ్జ సుభాష్ మిర్చి కొనుగోలు కోసం స్వగ్రామం నుంచి దంతాలపల్లి మీదుగా రూ.56,430 తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

● సూర్యాపేట జిల్లా ఆతకూర్(ఎస్) మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన నాగమల్లు రూ.1.93 లక్షలు పత్తి కొనుగోలు కోసం తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేశామన్నారు.

● మద్దిరాల మండల కేంద్రంలోని బెల్ట్‌షాపుల్లో తనిఖీలు నిర్వహించి సుమారు రూ.5 వేల విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి చెక్‌పోస్టు వద్ద ఏపీ వెళ్తున్న వాహనంలో అనుమతికి మించి ఉన్న రూ.9.50 లక్షలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ప్రభుత్వ మద్దతుతోనే మహిళా రైతులపై హింస కనుమరుగు

● వ్యవసాయ సంక్షోభం నేపథ్యంలో మహిళా రైతులపై వ్యవస్థీకృత హింస : స్వభావం, రూపాలపై వర్క్‌షాప్





వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న నల్లగొండ జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, హాజరైన మహిళలు

నల్లగొండ, నల్లగొండ టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) ప్రభుత్వం ప్రణాళికయుతమైన మద్దతు అందించినప్పుడే మహిళా రైతులు, ఒంటరి మహిళలపై వ్యవస్థీకృత హింస కనుమరుగు అవుతుందని, ఆ దిశగా జిల్లా పాలనాయంత్రాంగాలు చర్యలు తీసుకోవాలని పలువురు సామాజిక వేత్తలు, మహిళా రైతులు అభిప్రాయపడ్డారు. మహిళా రైతులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని, ప్రతిపథకాన్ని మహిళల దరిచేర్చడానికి సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు. ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యంతో మహిళలు ఏదైనా సాధించగలరని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి అన్నారు. "వ్యవసాయ సంక్షోభ నేపథ్యంలో మహిళా రైతులపై వ్యవస్థీకృత హింస: స్వభావం, రూపాలు" అనే అంశంపై నల్లగొండ జిల్లా కేంద్రంలో మహిళా కిసాన్ అధికార్ మంచ్, సాప్ఫేకామ్, గ్రామ్య రీసోర్స్ సెంటర్ ఫర్ ఉమెన్ సంస్థలు శనివారం వర్క్‌షాప్ నిర్వహించాయి. నారీశక్తి అవార్డు గ్రహీత, సామాజికవేత్త రుక్మిణీరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌ఎలో పలువురు మహిళారైతులు, ఒంటరి మహిళలు తమ అనుభవాలను వివరించారు.

మహిళా రైతుల ఇబ్బందులు తీర్చేందుకు చర్యలు తీసుకోవాలి



నల్లగొండ జిల్లాలో మహిళా రైతులు, ఒంటరిమహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారి ఆర్థిక స్వావలంభనకు, పురోభివృద్ధికి జిల్లా పాలనాయంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని కోరుతున్నాం. మేం జరిపిన అధ్యయనంలో నల్లగొండ జిల్లాలో మహిళారైతులు ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలు భూమి హక్కు లేకపోవడంతో నిర్మాణాత్మక హింసకు లోనవుతున్నారు. వారి ఎదుగుదలకు ప్రభుత్వం సహకరించాలి. ప్రధానంగా భూమి, నీటివనరులు కల్పించాలి. మార్కెటింగ్ అవకాశాలు కల్పించి వారి ఉత్పాదనలకు విలువ కల్పించాలి. చిన్నతరహాపరిశ్రమల ఏర్పాటుకు, స్వయం ఉపాధికి రుణాలందించాలి. ఒంటరి మహిళలకు పింఛన్లు, రేషన్‌కార్డులివ్వాలి. ఇతర అన్ని సహకారాలు అందించి ప్రణాళికాయుతంగా వారి వృద్ధికి తోడ్పడాలి.

- రుక్మిణీరావు, సామాజికవేత్త, నారీశక్తి పురస్కారగ్రహీత

మహిళా రైతులకు అన్నివిధాలా సహకరిస్తాం



నల్లగొండ జిల్లాలో మహిళా రైతులకు వ్యవసాయశాఖ తరుపున అన్నివిధాలా సహకారం అందిస్తాం. మహిళా రైతుల హక్కుల కోసం, ఒంటరిమహిళల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తూ వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయం. జిల్లాలో మహిళా గ్రూపులు ఇప్పటికే ఎంతో విజయవంతంగా ముందుకెళుతున్నాయి. మహిళా రైతులు సంఘటితంగా ముందుకొస్తే అన్నివిధాలా వారికి తోడ్పాడునందిస్తాం. ప్రధానంగా చిరు, తృణధాన్యాలు, ఇతర పంటలసాగు సమయంలో మహిళా రైతులు మార్కెటింగ్ వనరులు ఏర్పర్చుకున్నాకే ఆయా పంటలు సాగు చేస్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది. మార్కెటింగ్‌పై అవగాహన లేకుండా పంటలు పండిస్తే ఇబ్బంది పడాల్సివస్తుంది. జిల్లాలో ఉద్యానపంటల సాగులో మహిళారైతుల పాత్ర గణనీయంగా ఉంది. జిల్లా వ్యవసాయాశాఖ తరుపున మహిళారైతులకు అన్నివేళలా అందుబాటులోఉండి సహకారం అందిస్తాం.

- పి.శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

ఒంటరి మహిళగా ఎన్నో వేధింపులు ఎదుర్కొన్నా



భర్త చనిపోయిన తర్వాత నేను ఎన్నో అవస్థలు పడ్డా. ఇల్లు ఒకపక్కన కురుస్తుంటే ఇంకో పక్కన తలదాచుకున్న. నా భర్త బోర్ల మీద బోర్లు వేసి అప్పులపాలై దిక్కుతోచక ఆత్మహత్య చేసుకున్నాడు. మా అత్తమామలు నన్ను చాలా ఇబ్బందిపెట్టారు. అయినా తట్టుకొని నిలబడ్డా. నేనే సొంతంగా వ్యవసాయం చేసుకుంటున్నా. సొంతంగా ఇల్లు కూడా కట్టుకున్నా. పత్తి పంటలతో చాలా నష్టపోయాం. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నా.

- యాదమ్మ, మల్లారెడ్డిపల్లి, చింతపల్లి మండలం

ఆత్మస్థైర్యంతో ఏదైనా సాధించవచ్చు



మహిళారైతులు, ఒంటరి మహిళలు నిరాశ, నిస్పృహలకు లోనుకాకూడదు. పట్టుదల, ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యంతో ఉంటే ఏదైనా సాధించవచ్చు. మహిళలకు తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం ఎన్నో రకాల పథకాలు అందజేస్తోంది. మహిళల రక్షణకూ పలు చట్టాలున్నాయి. మహిళా రైతులకు ఉద్యానవనశాఖ ద్వారా పూర్తిసహకారం అందిస్తాం. ఏవైనా శిక్షణ, ఇతర శాఖాపరమైన మద్దతు ఎల్లవేళలా అందిస్తాం. పూలసాగు, కూరగాయల సాగు విషయంలో మహిళా రైతులను ప్రోత్సహిస్తున్నాం. మహిళారైతలు గ్రూపులుగా ఏర్పడి మార్కెటింగ్ నైపుణ్యాలను పెంచుకుంటే ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉంది. ఆ దిశగా ప్రయత్నిస్తే మావంతు సహకారం అందిస్తాం.

- సంగీతలక్ష్మి, జిల్లా ఉద్యాన శాఖాధికారి

జీవితాన్ని స్వశక్తితో నిలబెట్టుకున్నా



నాకు 14 ఏళ్ల వయసులో పెళ్లి చేశారు. నాకు 19 ఏళ్లప్పుడు నా భర్త కరెంటు షాక్‌తో చనిపోయాడు. ఆ తర్వాత ఎనిమిదేళ్లు మా అత్తమామల వద్దనే ఉన్నా. మా మరుదులతో సమానంగా నేను వ్యవసాయం చేసేదాన్ని. వాళ్లలాగే నాగలి పట్టా. మందుబస్తాలు మోశా. ఇంటిపనులు చేశా. అన్ని భరించాను. ఆస్తిలో నా వాటా నాకివ్వమని అడిగితే నన్ను, నా పిల్లలను ఇంటి నుంచి ఒంటిమీద బట్టలతో తరిమేశారు. బయటకు వచ్చి కష్టపడి నా పిల్లల్ని చదవించుకున్నా. నా కొడుకు నాకష్టం చూసి హాస్టల్‌లో ఉండి చదువుకున్నాడు. నా బిడ్డని కూడా చదివించా. రూ.12 కూలికి పోయి కుటుంబాన్ని పోషించుకున్నా. గవర్నమెంట్ ఇల్లొస్తే కట్టుకున్నా. నాబిడ్డలిద్దరికీ పెళ్లిళ్లు చేశా. అయిదెకరాల భూమి సాధించా. ఇప్పుడు నా మరుదులే నా వద్దకు వచ్చి అడిగితే వాళ్లకి సాగుకి రెండెకరాలిచ్చా. మిగిలిన మూడెకరాలు నేనే సొంతంగా వ్యవసాయం చేసుకుంటున్నా. కూరగాయలు సాగు చేస్తా. కోళ్లు పెంచుతా. నాజీవితాన్ని స్వశక్తితో నిలబెట్టుకున్నా. నాలాంటి ఒంటరి మహిళలకు ప్రభుత్వం ఆపదలో ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

- అలివేలు, గొగిల్లాపురం, చందంపేట మండలం, నల్లగొండ జిల్లా

గృహహింసకు లోనయ్యా. మాలాంటి వారిని ఆదుకోవాలి



నాకు 19 ఏళ్లప్పుడు పెళ్లి చేశారు. మా అత్తమామలతో నేను వేధింపులకు లోనయ్యాను. మా అమ్మవాళ్లింటి వెళితే కూడా ఇక్కడకు ఎందుకొచ్చావని, ఇరుగుపొరుగు సూటిమాటలతో వేధించారు. ఇంట్లో, బయట హింసకు లోనయ్యాను. ఒకదశలో డిప్రెషన్‌కు లోనవ్వాల్సి వచ్చింది. మాలాంటి వాళ్లకు ప్రభుత్వం అండగా ఉండాలి. మాకు ఇష్టం లేని పెళ్లిళ్లు, ఇష్టంలేని వృత్తులు కాకుండా నచ్చే పనులు చేసే అవకాశం కల్పించాలి. నాకు బ్యూటీషియన్ కావాలని ఉంది. అవసరమైన సహకారం ఇవ్వాలని కోరుతున్నా.

- లక్ష్మి, దేవరకొండ



వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, పదో తరగతి విద్యార్థి గాయపడ్డాడు. నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో జరిగిన ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందారు.



భూక్యా నాగు(ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, మార్చి 19 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం చెందాడు. రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దామరచర్ల మండలం లావూరిభూక్యాతండాకు చెందిన భూక్యా నాగు(22) డెకరేషన్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పనిముగించుకొని బైక్‌పై స్నేహితుడు రత్నావత్ దావీద్‌తో కలిసి ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై కిష్టాపురం వద్ద గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న నాగు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, దావీద్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మంగళవారం కుటుంబసభ్యులకు అప్పగించారు. నాగు బావ ధరావత్ సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కనగల్‌లో ఉపాధ్యాయుడు

కనగల్, మార్చి 19 : నల్లగొండ జిల్లా కనగల్ గ్రామశివారులో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఎస్ఐ రామకృష్ణాగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ మండలం పానగల్ ప్రాంతానికి చెందిన సాజీదాలీ కనగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయుడు(ఫిజికల్ డైరెక్టర్) పనిచేస్తున్నాడు. గుర్రంపోడు మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో పదో తరగతి పరీక్షలకు డిపార్ట్‌మెంట్ అధికారిగా విధులకు హాజరైనన సాజీదాలీ మంగళవారం సాయంత్రం బైక్‌పై నల్లగొండకు బయలుదేరాడు. ఈ క్రమంలో కనగల్ గ్రామశివారులో ఎదురుగా వస్తున్న గడ్డి ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది.



సాజీదాలీ(ఫైల్)

ప్రమాదంలో సాజీదాలీ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించి అప్పటికే అతను మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

స్కూల్ వ్యాన్, బైక్ ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాంజయంత్

గరిడేపల్లి, మార్చి 19: స్కూల్ వ్యాన్, బైక్‌ను ఢీకొన్న ఘటనలో పదో తరగతి విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. స్థానికుల ప్రకారం.. గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన రాంజయంత్ పొనుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షకు హాజరై తిరిగి బైక్‌పై పొనుగోడుకు వస్తున్నాడు. గరిడేపల్లి, పొనుగోడు గ్రామాల మధ్య సూర్యాపేట రహదారిపై ఎదురుగా వస్తున్న నేరేడుచర్లకు చెందిన స్కూల్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న రాంజయంత్ కిందపపడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించగా, సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులను వివరణ అడగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.





10 గంటల పాటు నిలిచిన విద్యుత్ సరఫరా

కోతులగుంపుతో శాలిగౌరారం సబ్‌స్టేషన్‌లో పేలిన సీటీ

ఇబ్బందులు పడ్డ 15 గ్రామాల ప్రజలు ● నిలిచిన విద్యుత్ సరఫరా




సబ్‌స్టేషన్‌లో ఖాళీపోయిన సీటీ

శాలిగౌరారం, మార్చి 19 : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్(సీటీ) పేలి 15 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం 10 గంటలకు సంఘటన చోటుచేసుకోగా రాత్రి 8 గంటల ప్రాంతంలో నల్లగొండ నుంచి సీటీ తెప్పించి ఏర్పాటు చేశారు. 10 గంటల పాటు 15 గ్రామాలు విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడ్డారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారంలోని సబ్‌స్టేషన్‌లోకి మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో పెద్దఎత్తున కోతుల సమూహం చొరబడింది. ఈ క్రమంలో ఓ కోతికి తీగలు తగిలి సబ్‌స్టేషన్‌లోని సీటీ పేలి పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ ఘటనతో మిగతా కోతులు పరారయ్యాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వెంటనే సిబ్బంది మంటలను చల్లార్చారు. ఏఈ శ్రీధర్ సబ్‌స్టేషన్‌కు చేరుకుని నూతన సీటీని నల్లగొండ నుంచి తెప్పించి రాత్రి 8 గంటలకు ఏర్పాటుచేశారు. కాలిపోయిన సీటి విలువ రూ.20వేల వరకు ఉంటుందన్నారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో దాదాపు 15 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోతుల చొరబడి ప్రతీ సందర్భంలోనూ సీటీలు ఖాళీపోవడం అటు నష్టంతో పాటు విద్యుత్ సరఫరా నిలిచి ప్రజలు ఇబ్బంది పడటం తరుచూ జరుగుతోంది. కోతులు సబ్‌స్టేషన్‌లోకి వెళ్లకుండా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇరువర్గాల మధ్య
ఆరుగురికి గాయాలు

భువనగిరి రూరల్, మార్చి 19 : పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాలు గొడ్డలి, కర్రలతో దాడి చేసుకున్న సంఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం వడపర్తిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వడపర్తి గ్రామానికి చెందిన మేడబోయిన సత్తయ్యకు చెందిన పశువులు ఎలిమినేటి పద్మారెడ్డి వరి చేనులో మేస్తుండడంతో పద్మారెడ్డి దూషణలకు దిగాడు. పక్కనే ఉన్న సత్తయ్య, అతడి కుమారుడు బాలమల్లేష్, గోపాలకృష్ణలు గొడ్డలితో దాడి చేయడంతో అక్కడనే ఉన్న పద్మారెడ్డి భార్య కళమ్మ, కుమారుడు సంతోష్‌రెడ్డి, అడ్డుపడడంతో వారిపై కూడా దాడికి దిగారు. ప్రతీగా వీరు కూడా సత్తయ్య, బాల మల్లేష్, గోపాల కృష్ణలపై కర్రలతో దాడి చేశారు. ఈ ఘర్షణలో పద్మారెడ్డి, సంతోష్‌రెడ్డి తీవ్రంగా, బాలమల్లేష్, గోపాలకృష్ణ స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయనపడిన ఎలిమినేటి కళమ్మ, పద్మారెడ్డి, సంతోష్‌రెడ్డిలను మెరుగైన వైద్యసేవల కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన బాలమల్లేష్, గోపాల కృష్ణ, సత్తయ్యలు భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.



గుట్టపై నేత్రపర్వంగా రథోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి 19 : ఏకశిఖర వాసుడు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కల్యాణలక్ష్మీ నరసింహుడు దివ్య విమానరథంలో భక్తులకు దర్శనమిచ్చి తరింపజేశాడు. జగత్ కల్యాణం..విశ్వశాంతి కోసం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో దివ్యవిమాన రథోత్సవం శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో రాత్రి వేళ మూలమూరుక్తలకు మహానివేదనల అనంతరం వైభవంగా కొనసాగింది. వివిధరకాల పుష్పాలు, మామిడి, అరటి ఆకుల తోరణలతో స్వామివారి దివ్యవిమాన రథాన్ని శోభాయామానంగా అలంకరించారు. ప్రధానాలయ పడమటి సప్తతల మహారాజగోపురం వద్ద అర్చకబృందం విశ్వక్సేనుడికి తొలి పూజలతో రథాంగ హోమం, రథాంగబలి, దిష్టికుంభ పూజలు నిర్వహించారు. పట్టువస్త్రాలు, బంగారు, వెండి, ముత్యాల ఆభరణాలతో నూతన కల్యాణ దంపతులైన లక్ష్మీ, నారసింహులను దివ్యమనోహరంగా అలంకరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ దివ్యవిమాన రథంపై అధిష్టింపజేశారు. రుత్వికులు, అర్చకబృందం వేదపారాయణాలు, మూలమంత్ర జప పఠనాలు, వేదమంత్రాలతో రథాంగ హోమ పూజలు జరిపి రథస్త లక్ష్మీనారసింహుడికి హారతి నివేదించారు. వేద మంత్ర పఠనాలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ లక్ష్మీనృసింహుడిని దివ్యవిమాన రథంపై విహరింపజేసే ఘట్టాలు నేత్రపర్వంగా సాగాయి. రథాంగ రూఢుడైన లక్ష్మీనృసింహుడి దివ్యవిమాన రథోత్సవంలో భక్తజనులు దర్శించుకుని తరించారు. రథస్త కేశవుడిని దర్శించుకుంటే పునర్జన్మ ఉండదని భక్తుల విశ్వాసం. స్వామివారి రథోత్సవంలో పాల్గొనేందుకు యాత్రాజనులు తండోపతండాలుగా తరలి వచ్చారు. స్వామివారి దివ్య విమాన రథోత్సవ పర్వాలను దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, అర్చకబృందం ఆధ్వర్యంలో సంప్రదాయరీతిలో నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బీ నరసింహమూర్తి, ఈవో ఏ భాస్కర్‌రావు, దేవస్థాన సిబ్బంది, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



భక్తుల సందోహం మధ్య తిరువీధుల్లో రథోత్సవం



రథాన్ని లాగుతున్న ఆలయ అధికారులు

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో

మిర్యాలగూడ, మార్చి 19: పార్లమెంట్ ఎన్నికల విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సహాయ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం జరిగిన నోడల్ అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినందున రాజకీయ సభలకు తప్పని సరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి 72 గంటల సమయం ముగిసినందున ప్రచారాలకు సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలు, వాల్‌రైటింగ్ తుడిపేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ హరిబాబు, ఉన్నారు.

హక్కుల సాధనకు పోరాటాలు : ఏఐటీయూసీ

మిర్యాలగూడ, మార్చి 19: కార్మికుల హక్కుల సాధనకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తున్నామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మంగళవారం జరిగిన లైట్ మోటార్ వెహికల్స్ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్ డివిజన్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన ట్రాన్స్‌పోర్ట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హిట్ అండ్ రన్ చట్టాన్ని అమలు చేయకూడదని కోరారు. నూతన చట్టంతో రవాణా రంగంలో పనిచేసే కార్మికులు, డ్రైవర్లు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. అనంతరం లైట్ మోటార్ వెహికల్ యూనియన్ నూతన డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎండి. సయీద్, అధ్యక్షుడిగా వినోద్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోపినాయక్, ఉపాధ్యక్షుడిగా ఎండి. రసూల్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ అక్తర్ ఎన్నికయ్యారు.

కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటాం: ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం, మార్చి 19: ఆపదలో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలను ఆదుకుంటామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని చిత్తలూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మద్ది మహేష్ తల్లి జలీల అనారోగ్యంతో మృతిచెందింది. గ్రామానికి చెందిన ఎర్ర గణేష్ గుండెపోటుతో మృతిచెందాడు. వంగమర్తి గ్రామంలో మృతిచెందిన గడ్డిపర్తి నాథనియల్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, పాదూరి శంకర్‌రెడ్డి, తీరుపాటి మల్లేష్, ఎంపీటీసీ నోముల జనార్దన్, బెల్లి వీరభద్రం, బొమ్మగాని రవి, మంగధుడ్డ శ్రీనివాస్, శ్రీధర్, వేముల గోపీనాథ్, ఎర్ర చైతన్య రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

త్రిపురారం, మార్చి 19: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంకణాల నివేదితరెడ్డి కోరారు. త్రిపురారం మండల కేంద్రంలో మండల కన్వీనర్ కటుకం మల్లికార్జున్ ఆధ్వర్యంలో బుధవారం బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండలో బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిద్ధాంతి కృష్ణ, కర్ర జానకిరాంరెడ్డి, పోను గోటి హరీష్, నర్సింహ, కొప్పు సోమయ్య, మెరుగు భిక్షపతి, హరిచంద్, భాస్కర్, వసంత్, లింగయ్య హరిలాల్, నాగరాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

డిండి, మార్చి 19: మండలంలో ఉపాధిహామీ నిధులతో పంచాయతీరాజ్ శాఖలో చేపట్టిన పనుల రికార్డులను సోషల్ ఆడిట్ బృందానికి పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఇవ్వలేదని జిల్లా అదనపు పీడీ సరిత తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరిగిన ఓపెన్‌ఫోరంలో ఆయన మాట్లాడారు. మండలంలో 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు చేపట్టిన పనులపై వారం రోజులుగా సోషల్ ఆడిట్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా ఓపెన్‌ఫోరం బహిరంగంగా నిర్వహించలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డానియెల్, అంబుడ్స్‌మెన్ గోరి, జయరాజు, ఎస్ఆర్‌పీ గంగరాజు, విజిలెన్స్ అధికారి వయాజ్ తదితరులు పాల్గొన్నారు.

'శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు'

చింతపల్లి, మార్చి 19: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని దేవరకొండ డీఎస్పీ గిరిబాబు హెచ్చరించారు. మండలంలోని గొడకొండ్ల రిజర్వాయర్ వద్ద ప్రత్యేక పోలీస్ చెక్‌పోస్టును మంగళవారం ప్రారంభించారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎస్పీ ఆదేశాల మేరకు దేవరకొండ డివిజన్‌లోని డిండి, చింతపల్లి మండలంలోని గొడకొండ్ల రిజర్వాయర్ వద్ద ప్రత్యేక పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాంపల్లి సీఐ నవీన్‌కుమార్, చింతపల్లి ఎస్ఐ యాదయ్య ఉన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

గుర్రంపోడు, మార్చి 19: మండలంలోని పిట్టలగూడెం గ్రామంలో నిధులు దుర్వినియోగం అయినట్లు వచ్చిన ఫిర్యాదులపై దేవరకొండ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామచంద్రారెడ్డి మంగళవారం విచారణ జరిపారు. పనులు చేయకుండా ఎంబీలు రికార్డు చేసి నిధుల కాజేశారని గ్రామ మాజీ సర్పంచ్ పోలె రాములమ్మపై అదే గ్రామానికి చెందిన రాజశేఖర్ జిల్లాపంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో రికార్డుల్లో నమోదు చేసిన పనులపై అధికారులు విచారణ చేపట్టారు. 16ఎంబీలలో ఏడు ఎంబీలపై విచారణ చేపట్టామని విచారణ వారం లోగా విచారణ పూర్తిచేస్తామని ఈఈ రామచంద్రారెడ్డి తెలిపారు. ఇదే విషయమై మాజీ సర్పంచ్‌ను వివరణ కోరగా పంచాయతీ నిధులు దుర్వినియోగం కాలేదని ఇదంతా గిట్టనివారు చేసే దుష్ప్రచారమని, ఏ విచారణకైనా సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ నర్సింహారెడ్డి, ఏఈ శ్రీనివాస్‌రావు, ఫిర్యాదుదారుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'అమ్మగూడెం' గ్రామానికి కార్యదర్శిని నియమించాలి

కనగల్, మార్చి 19: బదిలీపై వెళ్లిన కార్యదర్శి స్థానంలో అమ్మగూడెం గ్రామానికి కొత్త కార్యదర్శిని నియమించాలని ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొండ కొండల్, మాచర్ల శ్రీను కోరారు. ఇక్కడ పనిచేసిన కార్యదర్శి రేగట్ల గ్రామానికి బదిలీ అయ్యారని, ఆతని స్థానంలో దర్వేశిపురం గ్రామ కార్యదర్శిని గ్రామ ఇన్‌చార్జిగా నియమించారని తెలిపారు. ఆమె విధుల్లో చేరకుండానే సెలవు తీసుకుందని, దీంతో గ్రామంలోని సమస్యలను పరిష్కరించే వారు లేకుండా పోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

'సన్నధాన్యానికి గిట్టుబాటు ధర ఇప్పించాలి'

మిర్యాలగూడ, మార్చి 19: సన్నధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు కోరారు. సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో శ్రీనివాసరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మిల్లర్లు సిండికేట్‌గా మారి ధాన్యం ధర తగ్గించి దోచుకుంటున్నారని ఆరోపించారు. వారం రోజుల క్రితం క్వింటా సన్నధాన్యానికి రూ.2700 చెల్లించిన వ్యాపారులు ధాన్యం రాశిమరిగడంతో రూ.2200లకు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని, ఈ విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు మంగారెడ్డి, రాంరెడ్డి, రవినాయక్, వెంకట్‌రెడ్డి, వెంకన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

'స్వలాభం కోసమే పార్టీ మార్పు'

కొండమల్లేపల్లి, మార్చి 19: స్వలాభం కోసమే కొందరు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ అన్నారు. కొండమల్లేపల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆయన ఆరోపించారు.

పనులు సాగవు.. అవస్థలు తీరవు



ఇరువైపుల మురుగు కాల్వల నిర్మాణం కోసం తవ్వి వదిలేసిన గుంత

- రోడ్డుపైనే మురుగునీటి ప్రవాహం »
- రహదారి పనుల విస్తరణలోనూ జాప్యం »
- తొమ్మిది నెలలు గడుస్తున్నా పురోగతి లేని పనులు »

చండూరు, మార్చి 19: చండూరు మునిసిపాలిటీ రోడ్డువిస్తరణ పనుల్లో జాప్యంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా చండూరు మునిసిపాలిటీని సుందరంగా తీర్చి దిద్దేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.30కోట్లు మంజూరు చేసింది. పట్టణంలో డబుల్ రోడ్డు విస్తరణ పనులను నాటి మంత్రి కేటీఆర్ 2023 జనవరి 6న శంకుస్థాపన చేశారు. 2023 జూలై 7న అప్పటి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పనులు ప్రారంభించారు. ప్రారంభంలో కాంట్రాక్టర్ కొంత మేర పనులు చేశారు. తొమ్మిది నెలలు గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో తామ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. 2022లో జరిగిన మునుగోడు ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని దత్తత తీసుకొని, చండూరులో సెంట్రల్ లైటింగ్‌తో కూడిన రెండు లేన్ల రహదారి నిర్మించి సుందరంగా తీర్చిదిద్దుతామని అప్పటి పురపాలక శాఖామంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. ఎన్నికలు ముగిసిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.30కోట్లతో డబుల్ రోడ్డు విస్తరణ పనుల కోసం నిధులు మంజూరు చేసింది. రెండు వరుసల రహదారికి ఇరువైపులా మురుగు కాల్వల నిర్మాణానికి పెద్దగుంతలు తవ్వి కొంత మేరకు సిమెంట్‌తో మురుగు కాల్వలు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. గుంతలు తవ్విన మట్టి తరలించే క్రమంలో రోడ్డుపై పడడంతో ఆ మట్టి రోడ్డుపై పేరుకుపోవడంతో వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము ఎగసిపడి వాహనదారులకళ్లల్లో పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఓ వైపు దుమ్ము ధూళి, మురుగు కాల్వల నుంచి వచ్చే దుర్గంధ ఇండటే పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే సమీక్షించినా ఫలితం లేదు

రూ.30కోట్లనిధులతో చేపట్టిన రోడ్డువిస్తరణ నిర్మాణపనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని 2023డిసెంబరు 25న మునిసిపాలిటీ అభివృద్ధిపై పట్టణంలో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో అన్ని శాఖల అధికారులతో ప్రస్తుత ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా రోడ్డు విస్తరణ పనులపై ఆరా తీశారు. పనులు కూడా పరిశీలించారు. నాసిరకంగా పనులు చేపట్టారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. అయినా పరిస్థితి ఎప్పటిలాగే ఉంది.

దుర్గంధం భరించలేక పోతున్నాం



రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత లేదు. డ్రైనేజీ లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తుండడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. మురుగు నీరు రోడ్లపైకి ప్రవహిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దోమల వలన జ్వరాలతో బాధపడుతున్నాం. కొన్ని నెలలుగా రోడ్లపైనే మురుగు నీరు ఉంటుంది. నీరు నిల్వ ఉండడంతో వంటలు స్వల్ప విహారం చేస్తున్నాయి.

- రుద్ర రామలింగం, చండూరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయిన విషయం వాస్తవమే. పనులు 2023 డిసెంబరు 25న ఎమ్మెల్యే అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులు పునః ప్రారంభించడానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- వెంకట్ మణికరణ్, మునిసిపల్ కమిషనర్



పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. అయినా పరిస్థితి ఎప్పటిలాగే ఉంది.

మల్లు స్వరాజ్యం ఆశయాలు సాధించాలి

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషిచేయాలని పలువురు వక్తలు కోరారు. జిల్లా వ్యాప్తంగా మంగళవారం మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతి నిర్వహించారు. సంకల్ప ఆస్పత్రి, రాములబండ పీహెచ్ ఆధ్వర్యంలో నల్లగొండ మండలంలోని ఐద్వా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, రాముల బండ పీహెచ్ డైరెక్టర్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి నాగార్జున, కొండ వెంకన్న, రవీందర్ పాల్గొన్నారు. నల్లగొండ పట్టణంలోని విద్యానగర్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, జే ఉమా, బి ఇందిరా, పి పద్మావతి, గోవిందమ్మ, యాదమ్మ, అలివేలు, నవీన, రేణుక, పద్మ, మమత, లక్ష్మమ్మ, రాణి, రజిని, జయని పాల్గొన్నారు. పట్టణంలోని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నల్లగొండ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి స్వరాజ్యం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు మల్లు అరుణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ రామ్‌మోహన్, ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఆక్కినపల్లి మీనయ్య, కార్యదర్శి పి. నర్సిరెడ్డి, సత్యవతి ఆస్పత్రి యజమాన్యం సూరపల్లి సత్యనారాయణ, డాక్టర్ రాంమనోహర్, డాక్టర్ చైతన్య, కంప్యూటర్ ప్యాకల్టీ శంకర్, ఆక్కినపల్లి శోభన్‌బాబు పాల్గొన్నారు. దేవరకొండ సీపీఎం నాయకులు మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నల్ల వెంకటయ్య, బిజిలి లింగయ్య, బుడ్డ వెంకటేష్, శీను, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు. శాలిగౌరారంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఇండియా నియోజకవర్గ ఇన్‌చార్జి కొరె ఇందిరాప్రభాకర్ పాల్గొన్నారు. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య, ఐతరాజు నర్సింహ, జెలిజ మల్లయ్య, కురుపాటి లింగయ్య, పోలగోని శ్రీశైలం, నర్సింహ పాల్గొన్నారు. నిడమనూరులో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆవాస్ నాయకులు కట్ల లింగారెడ్డి, కొండేటి శ్రీను, కందుకూరి కోటేష్, కోమాండ్ల గుర్వయ్య, కుందం శేఖర్, చంద్రశేఖర్, బాల నారాయణ, బిలుమూరి శివ, పుల్లయ్య, రాములు, లింగయ్య పాల్గొన్నారు. నార్కట్‌పల్లిలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చెర్కు పెద్దులు, చింతపల్లి బయ్యన్న, ఆమనగంటి బలయ్య, ఎల్లయ్య, దుర్గయ్య, ఉపేందర్, నర్సింహ పాల్గొన్నారు. స్థానిక ఆదరణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, మేడి సుగుణమ్మ, కడగంచి అండాలు, జిట్ట రమాదేవి తదితరులు ఉన్నారు. మర్రిగూడలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

నేత్రపర్వంగా శ్రీతిరుమలనాథస్వామి కల్యాణం

చిట్యాలరూరల్, మార్చి 19: శ్రీభూసమేత శ్రీతిరుమలనాథస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణ మహోత్సవం వేదమంత్రోచ్ఛారణల నడుమ నేత్రపర్వంగా జరిగింది. ఉత్సవమూర్తులను వేదబ్రాహ్మణులు పట్టువస్త్రాలతో అలంకరించి గణపతి పూజతో ఆరంభించి కల్యాణ మల్లాన్ని నిర్వహించారు. కల్యాణ విశిష్టతను భక్తులకు వివరిస్తూ మాంగళ్యధారణగావిస్తూ కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. పురోహితులు తలంబ్రాల కార్యక్రమాన్ని నిర్వహించగా ముత్తైదువులు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించుకుని మొక్కును చెల్లించుకున్నారు. కల్యాణ నంతరం భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. కల్యాణానికి హాజరైన భక్తులకు దాతల సహాయంతో అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవానికి భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్, పొట్టపల్లి నర్సింహగౌడ్, పొట్టపల్లి చంద్రయ్య, సుభాష్, మురళి, నర్సింహ, హరీశ్‌రెడ్డి, సందీప్, వెంకట్‌రెడ్డి, దనుంజయ, తిరుమలేష్ పాల్గొన్నారు.



చిట్యాలలో కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

చండూరు: చండూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం మునిసిపల్ కౌన్సిలర్ చిలుకూరి రాధికశ్రీనివాస్ అన్నదానం వితరణ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. మునిసిపల్ చైర్మన్ తోకల చంద్రకళవెంకన్న దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది అధికార దాహం.. బీజేపీది అభివృద్ధి నినాదం: బూర

నార్కట్‌పల్లి, మార్చి 19: కాంగ్రెస్ పార్టీది అధికార దాహమని, బీజేపీది అభివృద్ధి నినాదమని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మేడబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు మంగళవారం బీజేపీలో చేరారు. వారికి పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డితో కలిసి కండువాలు కప్పి ఆహ్వానించారు. మోదీ నేతృత్వంలో దేశం ప్రపంచంలోనే బలమైన దేశంగా అవిష్కతమైందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో బీజేపీ మేర జాతీయ రహదారులను నిర్మించినట్లు చెప్పారు. బీబీనగర్ ఎయిమ్స్ మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కోమటిరెడ్డి బ్రదర్స్, జానా ఫ్యామిలీ, ఉత్తమ్ కుటుంబసభ్యులే కాంగ్రెస్‌లో కీలకంగా ఉండి జిల్లాలో కాంగ్రెస్ ఫ్యామిలీ కుటుంబంగా మారిందన్నారు. అన్నింద ముల్లిద్దరూ భువనగిరి ఎంపీలుగా పనిచేసి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ఆరుగ్యారంటీలను అమలుచేస్తామని చెప్పిన రేవంత్ సర్కార్ వంద రోజుల్లోనే పరిపాలన చేతకాక చేతులెత్తేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు మేడబోయిన శ్రీనివాస్, శేఖర్, బొడ్డు రామలింగం, వడ్డేగాని రామలింగం, సోముల రాజు, రాగిరి శివశంకర్ తదితరులు బీజేపీలో చేరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మండల వెంకన్న, మైల నర్సింహ్మ, మండల అధ్యక్షుడు కొర్వి శంకర్, పాల్వాయి బాస్కర్‌రావు, నడింపల్లి శ్రవణ్‌కుమార్, మునుకుంట్ల గణేశ్, తరాల శ్రీనివాస్, లింగాల వీరయ్య, పాలకూర రమేశ్, ఏర్పుల పరమేశ్, అంతటి రవి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నర్సయ్య

గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలి

చండూరు రూరల్, మార్చి 19: గ్రంథాలయాల అభివృద్ధికి కృషిచేయాలని మాజీ సర్పంచ్ పాల్వాయి సత్యనారాయణ అన్నారు. జేడీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ అధ్యక్షుడు వీవీ. లక్ష్మీనారాయణ సహకారంతో మండలంలోని బంగారిగడ్డలో ఏర్పాటు చేసిన శ్రీకాశీ పుస్తకాలయం (గ్రంథాలయం)ను మంగళవారం ప్రారంభించారు. నేటి యువకులు పుస్తక పఠనాశక్తి తగ్గిపోతోందన్నారు. జేడీ లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో గ్రంథాలయాలను అభివృద్ధి చేసి యువకులను దేశభక్తులుగా తయారు చేయడమే ఫౌండేషన్ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఇన్‌చార్జి కవిత, అపర్ణ, లైబ్రరీ ఇన్‌చార్జి మాదగోని నాగార్జున, బోయపల్లి భిక్షమయ్య, బోయపల్లి జంగయ్య, కర్నాటి వెంకటేశం, ఇరిగి రజనీకాంత్, సంకోజి తరుణ్, బోయపల్లి శ్రీకాంత్, కాటేపల్లి రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

మిర్యాలగూడ అర్బన్, మార్చి 19: రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ రహస్య ప్రదేశంలో నిల్వచేసిన సుమారు 40క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రూరల్‌పోలీసులు మంగళవారం సీజ్‌చేశారు. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రైల్వేస్టేషన్ సరిహద్దు ప్రదేశంలో నిల్వచేసిన బియ్యాన్ని ట్రాక్టర్ ప్యాన్ సహాయంతో తూర్పారపట్టి లారీలో తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయంగా సమాచారం వచ్చిందన్నారు. అక్కడ నిల్వ ఉంచిన 40 క్వింటాళ్ల బియ్యం, ట్రాక్టర్, లారీని సీజ్‌చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుళ్లు

మిర్యాలగూడ అర్బన్, మార్చి 19: మిర్యాలగూడలో అనధికార బాణాసంచా తయారీ కేంద్రంలో మంగళవారం రాత్రి పేలుళ్ల సంభవించాయి. ఈ ఘటనలో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మిర్యాలగూడకు చెందిన ఇప్పుల వ్యాపారి జాన్సి గోపీనాథ్ పట్టణానికి సమీపంలోని బాపూజీనగర్‌లో విజయ పేపర్ ట్యాట్ పేరుతో పరిశ్రమను నెలకొల్పారు. అయితే అందులో రహస్యంగా షెడ్డు ఏర్పాటు చేసి బాణాసంచా తయారు చేస్తున్నారు. మంగళవారం రాత్రి బాణాసంచా తయారీకి ఉపక్రమిస్తున్న క్రమంలో మంటలు చెలరేగి కొద్ది నిమిషాల వ్యవధిలో ముడిసరుకు అంటుకోవడంతో పెద్దశబ్దంతో పేలుళ్ల సంభవించాయి. షెడ్ సమీపంలో పొగలు, మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. కొంతకాలంగా బాణాసంచా తయారీ కేంద్రాన్ని అనధికారికంగా నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై అగ్నిమాపక అధికారి యాదగిరి స్పందిస్తూ బాణాసంచా తయారీ కేంద్రానికి ఎలాంటి అనుమతి లేదని, మటనపై విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

తిప్పర్తి, మార్చి 19: హత్యకు గురైన వ్యక్తి ఆచూకీ లభించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూరు గ్రామానికి చెందిన వనం ఈశ్వర్(33) కూలీ పనులు చేసుకుంటూ కట్టంగూరులో నివాసముంటున్నాడు. ఆదివారం ఉదయం 10గంటల సమయంలో ఇంటినుంచి బయలుదేరి సోమవారం సాయంత్రం తిప్పర్తి మండల పరిధిలోని అనిశెట్టి దుప్పలపల్లి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ పొలం వద్ద ఉన్న బావిలో మృతిచెందిఉన్నాడు. గమనించిన కౌలు రైతు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈశ్వర్ కుటుంబ సభ్యుల ఆచూకీ తెలియక తిప్పర్తి పోలీసులను సంప్రదించగా మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈశ్వర్ హత్యకు సంబంధించి పోలీసులు ఓ అనుమానితుడిని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. హత్యలో ఎంత మంది పాల్గొన్నారు? ఈ హత్య వెనుక మిస్టరీ ఏమిటి అనే విషయాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.

కనగల్ వాగులో చెలరేగిన మంటలు

కనగల్, మార్చి 19: కనగల్ వాగులో మంగళవారం సాయంత్రం మంటలు చెలరేగాయి. ఇసుక దళారులుగా బావిస్తున్న వ్యక్తులు వాగులోని జమ్మికి నిప్పంటించినట్లు తెలిసింది. వాగులో ఏర్పాటు చేసిన వ్యవసాయ బోరు మోటార్లకు సంబంధించిన పైపులు విద్యుత్‌వైర్లు మంటల్లో కాలిపోయాయి. రైతులకు లక్షల్లో నష్టం వాటిల్లింది. ఇసుక కోసమే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని రైతులు తెలిపారు.

మునుగోడులో దొంగతనాలు

మునుగోడు, మార్చి 19: మునుగోడులో గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి పలు చోట్ల దొంగతనాలకు పాల్పడ్డారు. జిల్లాకేంద్రం వైపుగల రోడ్డు దాసు సమీపాన ఆర్అండ్‌బీ రహదారి వెంట ఉన్న దొడ్డ రమేశ్ చెందిన వాటర్ సర్వీసింగ్ పాయింట్‌లో చోరీచేశారు. కౌంటర్‌లో ఉన్న రూ.8వేల నగదును అపహరించారు. ఎదురుగా ఉన్న ముత్యాలకు చెందిన దుబ్బాటిల్లో సైతం చోరీకు పాల్పడిన దొంగలు కొంత నగదు ఎత్తుకెళ్లారు. జిల్లాకేంద్రం నుంచి కూస్ టీం వచ్చి చోరీలు జరిగిన రెండు పోట్ల పరిశీలించి నమూనాలను సేకరించారు. అదేవిధంగా పట్టణంలోని కమ్మగూడెంకు చెందిన రావెల జెర్మన్య ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఉన్న రూ.లక్ష నగదు, 35తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపింది.

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువజన కార్యదర్శిగా పులిచర్ల గ్రామానికి చెందిన మేరా మదమయాన్ నియమితులయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు రమేష్‌యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి మదయాదవ్‌కు నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మునుగోడు: జైస్వరాజ్ పార్టీ వైపు అన్ని పార్టీల నాయకులు ఆకర్షితులవుతున్నారని ఆ పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి పురం సంతోష్‌కుమార్ అన్నారు. మునుగోడులో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు.

కనగల్: మండలంలోని రేగట్ల గ్రామంలో శ్రీవాణి శంకర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గంజి చంద్రమౌళి, కార్యదర్శి దొమ్మటి అంజయ్య, కర్నాటి శ్రీనివాస్, ఎంపీటీసీ షమ్మంత, బారెడిసెంటేశం, కడారి క్రిష్ణయ్య, ఎర్రోల సంజీవ ఉన్నారు.

కనగల్: మండలంలోని తిమ్మన్నగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కర్నాటి పరమేష్‌కు (సింహాద్రి) మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.50వేలు అందజేశారు. పరమేష్ ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స తీసుకున్నారు. హైదరాబాద్‌లో పరమేష్ మంగళవారం మంత్రిని కలవగా ఆయన ఆరోగ్య పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కర్నాటి మహేష్, ఐతగోని శంకర్ తదితరులున్నారు.

మిర్యాలగూడ టౌన్: ఆధ్యాత్మికతతో సత్ప్రవర్తన అలవడుతుందని మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. పట్టణంలోని శ్రీరామ మందిరంలో షిరిడిసాయి నక్షత్ర హాలుల్లో పాల్గొని మాట్లాడారు. జీవనశైలిలో మార్పుల కోసం దైవచింతన అవసరమన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు తల్లం ఆశోక్, గుంటూరు చంద్రశేఖర్, రంగా రవికుమార్, జయని రాజు, తల్లం ప్రమ్మ, నాగలక్ష్మి, శీలారాణి, శోభ, రజిని పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: మండలంలోని పెద్దకాపర్తి మాజీ ఎంపీటీసీ బత్తుల కాశాతి అనారోగ్యంతో బాధపడుతూ చిత్సాధి తీసుకుంటుండగా భువనగిరి మాజీ బూర నర్సయ్యగౌడ్ మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్, పొట్టపల్లి నర్సింహ, కాటం సందీప్, హరీష్, గుండాల నరేష్, కన్నెబోయిన మహలింగం ఉన్నారు.

సంక్షిప్త సమాచారం..

మునుగోడు రూరల్: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా రెవెన్యూ, పోలీస్ సిబ్బంది మంగళవారం గూడపూర్ వద్ద చెక్‌పోస్టును ప్రారంభించారు. మునుగోడు ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దని సూచించారు.

గుర్రంపోడు: గుర్రంపోడులో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ బస్సుల్లో కూడా తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ శివప్రసాద్ మాట్లాడుతూ రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లొద్దని సూచించారు.

మునుగోడు రూరల్: బెల్టుషాపుల్లో మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని పలివెల, దుబ్బకాలువ తదితర గ్రామాల్లోని బెల్టు షాపులపై మంగళవారం సిబ్బందితో కలిసి దాడులు చేయగా మద్యం పట్టుబడింది. మద్యం వ్యాపారులపై మద్యం స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొండమల్లేపల్లి: పిలిసిన్ దేశానికి చెందిన ప్రాణిక్ హీలర్ గ్రాండ్ మాస్టర్ చోకోకోక్ సుయి మహా సమాధి రోజును పురస్కరించుకొని మంగళవారం కొండమల్లేపల్లిలోని బధిరుల ఆశ్రమ పాఠశాలలో అన్నదాన కార్యక్రమం, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ప్రాణిక్ హీలర్ సాధకులు గురుప గ్రాండ్ మాస్టర్ చోవాకోక్ సుయ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బిజమారి సత్యనారాయణ, వింజమూరి చంద్రమౌళి, సిహెచ్.శ్రీహరి గోపాలాచారి, ఏరుకొండ రామ, పాల్గొన్నారు.

హాలియా: హాలియా సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నట్లు హాలియా ఏఈ బాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు తెలిపారు. 132కేవీ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ ఈశ్వర్‌నగర్ నుంచి వచ్చే 33కేవీ హాలియా ఫీడర్ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. హాలియా సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలు, హాలియా మునిసిపాలిటీ, అనుముల, ఇబ్రహీంపేట, అనుములవారిగూడెం, ఈశ్వర్ నగర్, మదారిగూడెం, పేరూరు, హజారిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని నాయుడుపాలెం, అలీనగర్, చల్మారెడ్డిగూడెం, కొత్తాల, వీర్లగడ్డతండా, విద్యుత్ నగరంలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

శాలిగౌరారం: రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు జాలోనిగూడెంలోని మస్జిద్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేష్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మసీదులో ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

డిండి: పేదరికంలో ఉన్న ఆరెకటికలను ఆదుకునేందుకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆరెకటికల సంఘం కార్పొరేషన్ సాధనసమితి రాష్ట్ర నాయకుడు వీరకాని రాజశేఖర్ మంగళవారం ఎమ్మెల్యే బాలునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. 12లక్షల జనాభా ఉన్న ఆరెకటికలకు ఇప్పటివరకు ఎలాంటి నామినేటెడ్ పదవులు దక్కలేదని పేర్కొన్నారు.

మునుగోడు రూరల్: మండలంలోని కిష్టాపురంలో వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, నల్లగొండ డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చౌటుప్పల్ జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు దేవిరెడ్డి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, అంజయ్యగౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి తహసీల్దార్‌గా అనురాధ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన జమీలుడ్డిన్ హెచ్ఎండీఏకి బదిలీ కాగా ఆమె స్థానంలో హైదరాబాద్ హెచ్ఎండీఏ నుంచి అనురాధ కొండమల్లేపల్లికి బదిలీపై వచ్చారు.

దామరచర్ల: నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో సక్రమంగా విధులు నిర్వహించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేశ్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వారు నల్లగొండలో డీఈవోకు వినతిపత్రం అందజేశారు.